# శ్రీకారం

జగిత్యాల బస్టాండ్...

వచ్చిపోయే బస్సులతో ఆ ప్రాంగణమంతా సందడిగా ఉంది.

కరీంనగర్ వెళ్ళడానికి రెడీగా ఉందా ఎక్స్‌ప్రెస్. తన సీట్లో చేరగిలబడిన డ్రైవర్ ఒకసారి వాచీ వంక చూసుకొని బస్ స్టార్ట్ చేశాడు.

బస్ కదులుతుండగా "వాటర్ బాటిల్ తీసుకొని మా ఆయన కిందికి దిగారు. బస్సాపండి" అంటూ గట్టిగా అరిచిందొక ప్రయాణీకురాలు, తన సీట్లోంచి లేచి నిలబడి.

అది విని "హోల్డాన్!" అనరిచాడు కండక్టర్.

బస్సుకి బ్రేక్ పడింది.

కిటికీ వైపు కూర్చొని క్రిందున్న ప్రయాణీకుల్ని గమనిస్తున్న రమేశ్ బస్సు ఆగిపోవడంతో దృష్టి లోపలి వైపుకి మరల్చాడు.

ఇంతలో బస్సులోకి వేగంగా దూసుకువచ్చాడొక వ్యక్తి. సరిగ్గా రమేశ్ కూర్చున్న సీటు దగ్గరే ఆగిపోయాడు. అతడి ముఖంలో ఏదో ఆతృత.

నిలబడి సంశయంతో కూర్చోవడానికి తటపటాయిస్తున్న ఆ వ్యక్తితో "కూర్చోండి.. ఎవరూ లేరు" అంటూ ఖాళీగా వున్న తన ప్రక్కసీటు ఆఫర్ చేశాడు రమేశ్.

"ఫర్లేదండి. నేను కూర్చోవడానికి రాలేదు" అంటూ ఆగి, కాస్త వంగి, రమేశ్‌కి మాత్రమే వినపడేలా లోగొంతుకతో తిరిగి అన్నాడిలా.

"ఆంజనేయస్వామి దర్శనానికి భార్యతో కలిసి కొండగట్టుకి వచ్చాను. మనీ పర్స్ మిస్సయ్యాను. కొండగట్టు నుండి జగిత్యాల వరకు రావడానికి సాయం చేశారొకరు. రాయపట్నం రిటర్న్ వెళ్ళాలిద్దరం... చార్జెస్ నలభై రూపాయలవుతాయి. కాదనకండి ప్లీజ్..."

ఆ వ్యక్తి స్వరంలో అర్థింపు, ముఖంలో దీనత్వం.

అతనలా సుడిగాలిలా రావడం, ఊహించని విధంగా ఆర్థిక సహాయాన్ని కోరడం, రమేశ్‌ని ఆశ్చర్యంలో పడేశాయి.

రమేశ్ తేరుకోకముందే తిరిగి అన్నాడావ్యక్తి.

"పోనీ ఎంతుంటే అంతివ్వండి. మిగతా ఎమౌంట్ మరొకర్ని అడుగుతా ప్లీజ్..."

పెద్దాయన. చదువుకున్నవాడు. ఆపదలో ఉన్నాడు. సాయం చేయాలన్పించింది రమేశ్‌కి.

అసంకల్పితంగా షర్ట్ జేబులోకి చేతిని పోనిచ్చి వేళ్ళకి తగిలిన ఓ నోటుని బయటకు తీసి, చూసిచ్చాడు. ఇరవై నోటది.

ఆ కాగితం చేతిలో పడటం ఆలస్యం "థాంక్సండీ..." అంటూ రెండు చేతులు జోడించాడు.

మాటల్లోనే కాదు, స్వరంలోనూ కృతజ్ఞత వ్యక్తపరుస్తూ వచ్చినంత హడావుడిగా బస్సు నుండి కిందికి దిగిపోయాడావ్యక్తి.

అప్పుడడిగాడు. ఆ దృశ్యాన్ని ప్రేక్షకుడిలా చూస్తూ రమేశ్‌కి ఆవలివైపు సీట్లో కూర్చుని ఉన్న మరో ప్రయాణీకుడు.

"ఎంతిచ్చారూ?" అని

ఆ ప్రశ్నకి రమేశ్ ఉలిక్కిపడ్డాడు.

"ఇరవై" అన్నాడు అప్రయత్నంగా.

సన్నగా నవ్వాడతను. అర్థం కాలేదు రమేశ్‌కి. విస్మయంగా చూశాడతని వంక.

"వాడు చెప్పిందంతా నమ్మారా?" అడిగాడు.

అవునన్నట్లు తలూపాడు రమేశ్.

"అదంతా మోసం. ఏదో కట్టుకథ చెప్పి జనం దగ్గర నుండి అందినంత లాగేయడం, ఆ డబ్బుతో తాగి తందనాలాడ్డం వాడికి అలవాటు" తనకు తెల్సిన విషయం చెప్పాడతను.

దెబ్బతిన్నవాడిలా చూశాడు రమేశ్.

మళ్లీ అతనే అన్నాడు.

"ఇలాంటి వాళ్లింతేనండీ! పని చాతకాదు. సవ్యంగా ఎలా జీవించాలో తెలీదు. ఇల్లు కాలిపోయిందనో... వరదలొచ్చాయనో... పర్స్ పోయిందనో... అబద్ధాలాడ్డం సిగ్గు విడిచి డబ్బులడుక్కోవడం. ఛఛ! జీవన పోరాటంలో పరాజితులండీ వీళ్లు" విసుగుదల ప్రదర్శించాడు.

రమేశ్ పెదవి విప్పాడు ఏదో అనాలని.

"మా ఆయనొచ్చారు. బస్సు పోనీయండి"అంటోంది ఇందాక బస్సాపించిన మహిళ.

కండక్టర్ "రైట్... రైట్..." అనడంతో బస్సు ముందుకు దూకింది.

బస్సు స్టార్టవడంతో మౌనం వహించిన రమేశ్, భారంగా నిట్టూర్చి సీట్లో వెనక్కి చేరగిలబడ్డాడు.

✣ ✣ ✣

అయిదు సంవత్సరాల అనంతరం.

విలుకాడు సంధించి వదిలిన బాణంలా దూసుకుపోతోంది బైక్.

డిపెప్ ట్రైనింగ్ క్లాస్‌కి ఆలస్యం కాకూడదని బైక్‌ని స్పీడుగా పోనిస్తున్నాడు రమేశ్. రోడ్డు మలుపు తిరగబోతుంటే సడెన్‌గా ట్రాఫిక్ లైట్ రెడ్ సిగ్నల్ చూపింది. వేగాన్ని తగ్గిస్తూ బ్రేక్ వేశాడు.

అతని ఆలోచన్లు డిపెప్ ట్రైనింగ్ వైపు మళ్లాయి.

ఒకటి నుండి అయిదవ తరగతి వరకు 'మూల్యాంకనం' గురించి ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కి శిక్షణ ఇస్తున్నారు. రమేశ్ ఆ ట్రైనింగ్ క్లాసులకి అటెండ్ అవుతున్నాడు.

రమేశ్ ఆలోచన్లని చెల్లాచెదురు చేస్తూ "సార్! మీకు తోచినంత..." అనే మాటలు విన్పించాయి.

తన ఆలోచన్లని కట్టిపెట్టి ఆ స్వరం విన్పించిన వైపు తల తిప్పాడు.

బైక్‌కి ముందుగా కుడివైపు ఒక కుర్రాడు నిలబడి ఉన్నాడు వినయంగా. వాడి చేతిలో మసిగుడ్డ.

విషయం అర్థమైంది రమేశ్‌కి.

'గ్రీన్ సిగ్నల్ పడేలోగా రోడ్డుపైన ఆగివుండే వెహికిల్స్ దుమ్ము దులపడం, ఆ వాహన యజమానులు దయతలచి ఒకటో రెండో రూపాయలిస్తే స్వీకరించడం లేదంటే మౌనం వహించడం.'

'ఇలా ఈ మధ్య కొన్ని కొన్ని ట్రాఫిక్ ప్రదేశాల్లో జరుగుతోంది. అలాంటి కుర్రాళ్లు డైరెక్ట్‌గా అడుక్కోకుండా, మరొకచోట కుదురుగా పని దొరక్క... ట్రాఫిక్ జామ్ అయ్యే కొన్ని ఘడియల వ్యవధిలో వెహికిల్‌ని శుభ్రపరచి డబ్బులు సంపాదించే మార్గాన్ని ఎన్నుకుంటున్నారు' అనుకుంటూ షర్ట్ జేబులోంచి రెండ్రూపాయల బిళ్ల తీసి ఆ కుర్రాడి చేతికందించాడు. దాన్ని తీసుకొని విప్పారిత మోముతో వాడు మరో వెహికిల్ వైపు కదిలాడు.

వెళ్తోన్న ఆ కుర్రాడి వంకే చూస్తూ 'ఇది సమర్థనీయమా కాదా అనే విషయం ప్రక్కనపెడితే బిచ్చమెత్తడం కన్నా బెటర్ కదా?' అనుకున్నాడు.

చప్పున గతంలో రాఘవ అనే తాగుబోతు నమ్మించి ఇరవై నోటుని తీసుకువెళ్లిన సంఘటన రమేశ్‌కి గుర్తుకొచ్చింది.

అసంకల్పితంగా రాఘవ రూపం మదిలో మెదిలింది.

తల విదిల్చి సిగ్నల్ వైపు చూపు మరల్చుతుండగా రమేశ్ దృష్టి అతనికి కొంత దూరంలో ఆగి వున్న స్కూటర్‌పై పడింది.

ఉలిక్కిపడ్డాడు!

కళ్ళు చిట్లించి మరీ చూశాడు అనుమానం తీర్చుకుందామని.

యస్! అతనే... అతనే రాఘవ. ఇన్ని రోజులకి మళ్లీ ఆ తాగుబోతు సడెన్‌గా కలవడం ఆశ్చర్యానికి గురి చేసింది. పైగా స్కూటర్ డ్రైవ్ చేస్తూ.

ఇంతలో సిగ్నల్ పడింది. వాహనాల్లో కదలిక ప్రారంభమయింది. అలర్టయ్యాడు రమేశ్. బైక్ స్టార్ట్ చేసి ఆ స్కూటర్ వెనుక పరుగెత్తించాడు.

రాఘవను వెంబడించి కూపీ లాగాలని అతని ఆలోచన.

అసలెవరీ రాఘవ ?

ట్రైనింగ్ క్లాస్ లేటయినా సర్ది చెప్పుకోవచ్చు గానీ అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకోకూడదనుకున్నాడు.

మద్యానికి బానిసై జనాల్ని మోసం చేస్తూ డబ్బు గుంజుతున్న ఆ వ్యక్తి గురించి ఆరాతీసి అతనికి తగిన బుద్ధి చెప్పాలని స్కూటర్‌ని ఫాలో అవుతున్నాడు.

శ్రీనగర్‌లో ప్రవేశించిన ఆ స్కూటర్ వీధి మలుపు చివరన తాళం వేసి వున్న ఓ ఇంటి ముందాగింది. స్కూటర్ పార్క్ చేస్తుంటే వెనక కూర్చున్నావిడ లాక్ తీస్తోంది. కొంత దూరంలో ఆగి ఈ తతంగాన్ని చూస్తున్న రమేశ్ 'మొదట రాఘవ భార్య ద్వారా అతడి గురించి తెలుసుకొన్నాకే రాఘవని కలవా'లని డిసైడ్ చేసుకొని బైక్‌ని వెనక్కి మళ్లించాడు.

✣ ✣ ✣

మరుసటి రోజు.

రమేశ్ తెచ్చిన కూరగాయల బ్యాగ్‌ని అందుకుంటూ భార్య సునీత చెప్పింది. "శేఖరన్నయ్య ఫోన్ చేసారిందాక. ఇద్దరూ కలిసి ఏదో ఆఫీసుకి వెళ్లామనుకున్నార్టగా. ఒక గంటలోగా మిమ్మల్ని రెడీ కమ్మన్నారు."

భార్య చెప్పింది వింటూ లాండ్ ఫోన్ వైపు కదిలాడు.

"ఎవరికి ఫోన్ ?" అడిగింది.

"శేఖర్‌కి" చెప్పాడు.

"బయటకు వెళ్లుంటారాయన. తనొచ్చేదాక మిమ్మల్ని ఇంట్లోనే ఉండమన్నారు" అంది.

అది విని ఫోన్ చేయడం మానుకున్నాడు.

"సరే వాడొచ్చినా, తిరిగి ఫోన్ చేసినా చెప్పు. ఈరోజు వెళ్లడం కుదరదని. అర్జంటుగా బయటకు వెళ్తున్నాను. రేపు సండే కాబట్టి వాడి కోసం ఫిల్లుండి లీవ్ పెడతానని చెప్పు." అనేసి గబగబా బయటకు నడిచి బైక్ స్టార్ట్ చేశాడు.

సరాసరి రాఘవ ఇంటికి బయల్దేరాడు.

✣ ✣ ✣

తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

బైక్‌ని ఇంటి ముందరే ఆపి తలుపు తట్టాడు.

ఆలస్యం చేయకుండానే "ఎవరు?" అంటూ తలుపు తీసింది. ఆరోజు రాఘవ స్కూటర్ వెనకాల కూర్చున్నావిడ.

'తనెవరని చెప్పాలి?' చప్పున తట్టిందొక ఆలోచన.

ఒక్కడుగు వెనక్కి జరిగి, గబగబా బైక్‌కి తగిలించిన బ్యాగ్ తెరచి అందులోంచి నోట్‌బుక్ తీశాడు. షర్ట్ జేబులోంచి పెన్ తీసి చేతిలో పెట్టుకుని ఆమె ముందుకి వచ్చి అన్నాడు.

"జనాభా సేకరణ కోసం వచ్చానండి. నేను వృత్తిరీత్యా టీచర్‌ని, మాకీ వర్క్ అప్పగించారు. మీ కుటుంబ వివరాలు చెబితే నోట్ చేసుకుంటాను."

"జనాభా లెక్కలంటూ ఆర్నెల్ల క్రితమే వచ్చి రాసుకున్నారు కదండీ!" అందామె ముఖంలో విసుగుదల ప్రదర్శిస్తు.

'అవున్నిజమే. ఆ డ్యూటీ తను కూడా చేసిన మాట వాస్తవమే. ఛ! దొరికిపోయాను. ఏదో ఒకటి చెబితే నమ్మేస్తుందనుకుంటే జ్ఞాపకం పెట్టుకొని మరీ ఆరా తీస్తోంది. బయట ప్రపంచంలో జనాలేమో బహు నమ్మకంగా మోసాలు, పాపాలు రాఘవలాగా లాఘవంగా చేసేస్తున్నారు. తనకేమో చిన్న అబద్ధం కూడా ఆడ్డం రాదు' తనలో తనే గొణుక్కున్నాడు.

రీసెంట్‌గా టీచర్స్‌కి అప్పజెప్పబడిన మరో డ్యూటీ గుర్తుకు వచ్చి "కంగారులో పొరపడ్డానండీ! జనాభా సేకరణ కాదు. ఓటర్ల జాబితా సవరణ డ్యూటీ మీద వచ్చాను" చెప్పాడు తడుముకోకుండా.

నమ్మేసింది.

ఇంట్లో వాళ్ళందరి గురించి అడగడం ప్రారంభించాడు. ఓపిగ్గా సమాధానాలిచ్చింది.

ఆమె అందించిన కుటుంబ వివరాల ప్రకారం...

'రాఘవ ప్రభుత్వోద్యోగి. ఆమె అతని భార్య. వాళ్ళకి ఒకబ్బాయి. అతను అకాల మృత్యువాత పడ్డాడు. ఇప్పుడింట్లో ఉంటున్నది ఇద్దరే'

రాఘవ ఎంప్లాయ్. అందులోనూ గవర్నమెంట్ ఎంప్లాయ్ అనే విషయం రమేశ్‌ని విభ్రాంతికి గురి చేసింది. 'ఒక ప్రభుత్వోద్యోగి బిహేవియర్ అలా ఉండటమేంటి?' రమేశ్‌కి ఏమీ పాలుపోలేదు. మిస్టరీగా అన్పించింది.

తన ఆలోచన్లని కట్టి పెట్టాడు. బుక్‌లో నోట్ చేసుకున్నట్టు యాక్ట్ చేసి "థాంక్సండీ. వస్తాను" అంటూ కదిలాడక్కడి నుండి.

✤ ✤ ✤

రమేశ్ ఫ్రెండ్ శేఖర్ ఇద్దరూ మున్సిపల్ ఆఫీసుకి వెళ్లారు. శేఖర్ మున్సిపాలిటీ కాంట్రాక్టర్. అతడికొక చెక్ రావాల్సి ఉంది.

సెక్షన్ క్లర్క్ దగ్గరకు వెళుతుండగా రమేశ్ అడిగాడు.

"చెక్ ఎంత?"

"లక్షకి" చెప్పాడు శేఖర్.

"అయిదు లక్షల కాంట్రాక్ట్ అన్నావుగా?" ప్రశ్నించాడు.

"ఈ ఎమౌంట్ అడ్వాన్స్ మాత్రమే. వర్క్ స్టార్ట్ చేశాక... బిల్స్ సబ్మిట్ చేస్తే మరో రెండు లక్షలు... పని పూర్తి చేశాక మిగతా రెండు లక్షలు పే చేస్తారు"

మాట్లాడుకుంటూ గదిలోకి అడుగుపెట్టారు.

తలొంచుకొని ఫైల్స్ ముందేసుక్కూర్చున్నాడా క్లర్క్.

"హలో సర్!" శేఖర్ విష్ చేశాడా క్లర్క్‌కి.

బదులుగా "నమస్తే!" అంటూ తలెత్తిన ఆ వ్యక్తిని చూసి పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు రమేశ్.

వెతకబోయిన తీగె కాలికి తగిలినట్లు -

అతను రాఘవ !

కానీ రాఘవ ముఖంలో ఎలాంటి ఉలికిపాటు... రమేశ్‌ని గుర్తుపట్టిన ఫీలింగ్స్... మచ్చుకి కూడా లేవు.

"ఎలా గుర్తిస్తాడు మరి? తనలాంటి వాళ్ళ దగ్గర రోజుకి ఎంత మందిని ముష్టెత్తుతాడో?" సర్ది చెప్పుకున్నాడు రమేశ్.

"రాఘవని ఎలా కదపడమా?" అని అతడాలోచిస్తున్న తరుణంలో జరిగిందా ఘటన.

శేఖర్ తన ప్యాంట్ పాకెట్ లోంచి ఓ నోట్ల కట్ట తీసి రాఘవకి అందించాడు. చిర్నవ్వుతో అతనా డబ్బుని స్వీకరిస్తుంటే ఒళ్లు మండిపోయింది రమేశ్‌కి.

"శేఖర్ ఏంట్రా? ఎందుకా డబ్బు? నీకు రావల్సిన చెక్‌కోసం నీవు లంచం ఇవ్వడమేంట్రా?" తీవ్రంగా స్పందించాడు రమేశ్.

"మరి ఇతరులకి చెందాల్సిన చెక్‌కి మనం లంచం ఇస్తామా?" పెదాలపై చిరునవ్వు పులుముకుంటూ జోక్ విసిరాడు శేఖర్.

"నేను సీరియస్‌గా అడుగుతున్నాను. ఈ పెద్దమనిషి గురించి నీకు తెలీదు. పక్కా తాగుబోతు. పెద్ద మోసగాడు" రమేశ్ మాటల్లో ఆవేశం.

అది విని మ్రాన్పడిపోయాడు శేఖర్.

రాఘవ మొహం చేవురించింది. ఉలికిపాటుగా చూశాడు రమేశ్ వంక.

"ఒరేయ్! యంగర్స్‌వి . ఎడ్యుకేటెడ్ పర్సన్స్‌వి. మనం లంచాలని ప్రోత్సహించడమేంట్రా?" కాస్త స్వరం తగ్గిస్తూ అన్నాడు రమేశ్.

రాఘవ చూపులు నిర్మలమయ్యాయి. మౌనం దాల్చాడతను. విషయం అవగతమైంది శేఖర్‌కి. రమేశ్ ఆవేశం వెనుక ఆంతర్యం బోధపడింది.

"ఇప్పుడు నీవు చూస్తున్న రాఘవ గారు ఒకప్పుడు నీకెదురైన రాఘవ కాదురా. తాగి ఆఫీసుకి వస్తున్నాడనే కంప్లయింట్‌తో సస్పెన్షన్‌కి గురయ్యాడు కొద్ది రోజులు. దాంతో తాగుడికి మరింత బానిసై ఇల్లూ వాకిలి మరిచి రోడ్డుమీద పడ్డాడు. తాగడానికి డబ్బులు దొరక్క జనాల్ని చీటింగ్ చేయడం ప్రారంభించాడు. బహుశా ఆ పాత రాఘవే నీకు తారసపడి ఉంటాడు.

కానిపుడీయన పూర్తిగా మారిపోయారు. ఎదిగిన ఒక్కగానొక్క కొడుకు ఆక్సిడెంట్‌కి గురై కడుపుకోతని మిగిలిస్తే... ఆ వ్యసనం నుండి బయటపడి... జీవచ్ఛవంలా జీవనం వెళ్లదీస్తున్నాడు" చెప్పుకుపోతున్నాడు శేఖర్.

రమేశ్ విస్మయానికి గురయ్యాడు. కొడుకు ప్రసక్తి వచ్చి రాఘవ గుండె పొరల్లో

తడి గాయం సుడులు తిరిగిందేమో... అతడి మొహంలో విషాద రేఖలు అలుముకోవడం గమనించాడు.

"ఇక ఇందాకటి డబ్బు లంచంగా అన్నావు చూడూ! అది లంచం కాదు. అనాథ శరణాలయానికి చందా..." చెప్పాడు శేఖర్.

షాకయ్యాడు రమేశ్. ఒక కొండచరియ విరిగి పక్కనే పడ్డట్టు కంపించిపోయాడు.

"కొడుకు మరణం ఆయనలో ఒక ఉన్నతాశయానికి శ్రీకారం చుట్టింది. పిల్లలు లేని తను అనాథ పిల్లల్ని చేరదీశాడు. ఎవరినో ఒక్క పిల్లవాణ్ణి పెంపకానికి తీసుకోకుండా అనాథ పిల్లలందర్నీ అక్కున చేర్చుకున్నాడు. అనాథ శరణాలయాన్ని నెలకొల్పాడు. దిక్కులేని వాళ్ళకి తనే దిక్కవుతూ, తన జీతాన్ని జీవితాన్ని అనాథ పిల్లలకై అంకితం చేశాడు. చేయూతగా ఇలా చందాలు ప్రోగు చేస్తున్నాడు.

మామూళ్ళివ్వడం మాలాంటి వాళ్ళకి మామూలే. కానీ మామూళ్ళని ఒక మహాకార్యానికి వినియోగింపజేస్తూ మాకొక తృప్తిని మిగులుస్తున్నాడీయన. అది కూడా మాకై మేం స్వచ్ఛందంగా ఇస్తేనే" అంటూ రాఘవ టేబుల్ పై ఉన్న చందా బుక్‌ని తీసి రమేశ్‌కి చూపాడు శేఖర్.

రాఘవ మీదున్న దురభిప్రాయం తొలగిపోతూ అతనంటే ఒక గౌరవభావం ఏర్పడసాగింది రమేశ్‌కి.

రెండు క్షణాల నిశ్శబ్దానంతరం.

"క్షమించండి రాఘవ గారు. మీ గురించి చెడు తలిచాను. నిస్వార్థంగా మీరు చేస్తున్న ఈ సమాజసేవ చాలా గొప్పది. రియల్లీ ఐ అప్రిసియేట్ యూ! మీ కోసం కాకుండా పరుల కోసం అందునా అనాథ బాల బాలికల కోసం మీరొక యజ్ఞాన్ని నిర్వహించడం...

హేట్సాఫ్‌యూ!

**బ్రతకడం చాతకానివాడే జీవితంలో పరాజితుడనుకునేవాణ్ని. కానీ పరులకి జీవితాన్నివ్వలేని వాడే పరాజితుడనే సత్యం బోధపడింది.**

నాకు తెలిసి నేనింతవరకు ఎలాంటి సామాజిక సేవ చేయలేదు. కానిప్పుడు శ్రీకారం చుడుతున్నాను. మీ స్ఫూర్తితో మనస్ఫూర్తిగా! మీ యజ్ఞంలో పాలుపంచుకుంటున్నాను" అంటూ చందా బుక్ అందుకొని ఒక వెయ్యి రూపాయలు రాశాడందులో.

"ఎమౌంట్ శేఖర్‌తో పంపిస్తాను" అంటున్న రమేశ్ వంక ఆశ్చర్యంగా చూశాడు శేఖర్.

మనోవికారాదులు విసర్జించిన మౌనిలా... మౌనంగా... రాఘవ!

**(21.09.2003)**

*